# రెండు విధాల ....

"ఎం. కె. ఎస్."

నేనోనాడు మాధవరావు మేడమీద కూర్చొని సిగరెట్టు కాలుస్తూ ఆనందవాణి చదువుతున్నాను. సిగరెట్టుపీక పారేద్దాం అని కిటికీ వద్దకు వెళ్లాను. ఆ కిటికీవద్దకు వచ్చేసరికి నాకొక చిత్రమైన దృశ్యం కన్పించింది. అదేమంటే ఓ ఆయన స్నానంచెయ్యడానికి పీటమీద కూర్చున్నాడు. ఆయన్ని యిద్దరు ప్రౌఢస్త్రీలు తలంటి స్నానం చేయిస్తున్నారు. ఆ దృశ్యం చూసేటప్పటికి నాకో విధమైన ఈర్ష్య ఆశ్చర్యం కలిగాయి. ఇంతలో మాధవరావు వచ్చాడు. ఆ విధంగా స్నానంచేసే ఆయనను గురించి అడిగాను. ఆయన ఒక చాకలివాడు. అతను బట్టలు శుభ్రంగా ఉతికి బాగా యిస్త్రీ చేయడంలో ఆ వూళ్ళో ప్రసిద్ధికెక్కాడు. అతను మొదట ఒక భార్యను వివాహము చేసుకొని బట్టలు ఉతికి కాలం గడిపేవాడు. అతను బాగా ఉతకడంచేత అతనికి డిమాండు ఎక్కువైపోయింది. అప్పుడు ఉతకడానికి, యిస్త్రీ చేయడానికి యిద్దరి లేబరు సరిపోయేదికాదు. అందుచేత యింకొక చాకలిని తన క్రింద నియమించుకోవాలనుకున్నాడు. కాని అతని క్రిందివాడు పని బాగా నేర్చుకొని అసలికే చెడగొడతాడని యింకొక భార్యను పెళ్ళిచేసుకున్నాడు. రెండో సంగతి అతను ఆలోచించినదేమంటే ఆమె రెండువిధాల ఉపయోగపడుతుంది. అతను యిద్దరు భార్యలతో ఆనందంగా ఉన్నాడని చెప్పాడు. "ఆ చాకలివాని అదృష్టం" అని నేనొక నిట్టూర్పు విడిచాను.

★

ఒక సినిమా డైరక్టరు తన బంధువుల్లో ఉన్న ఒక చక్కటి అమ్మాయిని వివాహమాడుతానని వాగ్దానము చేశాడు. తరువాత రెండు నెలలకే ఒక సినిమా నటిని వివాహమాడాడు. అది విని ఆ అమ్మాయి పినతండ్రి వచ్చి "ఏమండీ మా అమ్మాయిని వివాహం చేసుకుంటానని అనేకసార్లు వచ్చి వాగ్దానాలుచేసి తుదకు సినిమా నటిని చేసుకున్నారే. ఈవిధంగా మోసం చేయవచ్చునా?" అని గట్టిగా గద్దించి అడిగాడు. అప్పుడతను "మీకు తెలీదటండీ! నేను సినిమా డైరక్టరని; ఈ దినాల్లో ఏదీ అంటే యుద్ధంగాని, బంధుత్వంగాని, వివాహంగాని మరే ఏదైనాగాని ఆర్థికంగా ఆలోచిగాని చేయకూడదని. నేను రెండువిధాల ఉపకరిస్తుందని సినిమా తారను వివాహమాడాను, దీంట్లో తప్పేముంది. మీరు నా స్థానంలో ఉంటే ఏంచేస్తారో చెప్పండి" అని ధిక్కరించాడు.

★

ఓనాడు నేను బజారుకెళుతుంటే మా అబ్బాయికి చదువుచెప్పే స్కూలుమాస్టరు ఎదురైయ్యారు. ఆయన చంకలో మిల్లుపంచెల జత ఉంది. 'ఏమండోయి మాస్టరుగారు ఎక్కడినుంచి' అన్నాను. అబ్బె యిక్కడినుంచేనండీ, మా రేషన్ కార్డుమీద బట్టలు కొందామని వెళ్ళితే పదిగజాల కంటే ఎక్కువ యివ్వనన్నాడు. నేనొక గంటసేపు ఆలోచించి రెండు పంచెలు ఒక తువాలు కొన్నానండీ' అన్నాడు. అయితే మీ భార్యకోసం ఏమి కొన్నారుగాదే అని ప్రశ్నించాను. అయ్యో! అన్నివిధాల ఆలోచించే ఈ రెండు పంచెలు రెండువిధాల—అంటే ఆమెకు కోకలుగాను, నాకు పంచెలుగాను—ఉపయోగపడతాయని కొన్నానండీ అని దీనంగా అన్నాడు.

★

మొన్న మా మామగారు వస్తున్నారని స్టేషనుకు వెళ్లాను. ఆయన బుష్షకోటు పంట్లాం, చేతిలో

* ఆవరం [illegible]

బెత్తంతో దిగారు. ఆయనను చూసేసరికి నాకో కొత్తదనం కన్పించింది. ఎందుకంటే ఆయన ఎప్పుడు కోటు, టై, వేసి పెద్దవేషంతో ఉండేవాడు. ఇప్పుడు ఆయన తొడిగిన బుష్కోటు నాకేదో కొంత నవ్వుకూడ కల్గించింది. ఆయన ప్లాటుఫారంమీద నించొని ఆయన అమ్మాయి, మన మఠం, గురించిన కుశలప్రశ్నలు వేస్తున్నారు. నేనాయన బుష్కోటువైపే చూస్తు పట్టలేక 'ఈ బుష్కోటు ఎప్పుడు కుట్టించారు' అని అడిగాను. అవును నీ వెందుకు అడిగినావో నాకు తెలుసు. చూడు. ఈ రోజుల్లో బట్టలు దొరకడం దుర్లభం అయిపోతూంది. పూర్వం అంటే యింటినిండా బట్టలే. బనీనుమీద చొక్కా, చొక్కామీద కోటు వేసేవాళ్ళం. ఏంచెయ్యమంటావు బట్టల కరువు. ఈ మధ్య మద్రాసు వెళ్ళినప్పుడు రెండు బుష్కోట్లు కుట్టించా. ఇవి రెండువిధాల ఉపకరిస్తున్నాయి' అని చెప్పారు.

★

నేను బెజవాడ వెళ్ళినప్పుడు వెంకటేశం యింట్లో బసచేశాను. అతని వేషం, ఇల్లు, ఫర్నిచరు, రేడియో చూసి నీవు పేపరు కరెస్పాండెంటువు గదా! నీకీ రోజుల్లో ఎట్లా సరిపోతుందోయి అని అడిగాను. ఈ రోజుల్లో ఒక వృత్తితో గడవడం సాధ్యం కాదు. నేను యిన్సూరెన్సు ఏజంటుకూడాను. ఈ రెండువృత్తులతో కాలక్షేపం చేస్తున్నాను. అయితే ఓ సంగతి. ఈ రెండువృత్తులకు మంచిసంబంధం ఉంది. ఈ పేపరు కరెస్పాండెంటుతనంతో పెద్ద పెద్దవాళ్ళ దగ్గర మంచి పలుకుబడి సంపాదించవచ్చు. ఆ పలుకుబడితో యిన్సూరెన్సు అభివృద్ధిచేయవచ్చు. ఈ పేపరు కరస్పాండెంటుతనం ఉంటే రెండు విధాల తోడ్పడుతుంది. ఈ రెండువృత్తులతో మనకు ఖులాసాగా జరిగిపోతుంది అన్నాడు.

★

మా యింటి కెదురుగా ఓ రెడ్డిగారున్నారు. ఆయన యింట్లో రెండు పడకకుర్చీ లున్నాయి. ఒకదానిమీద ఆయన, రెండోదానిమీద ఆయన భార్య కూర్చొని ఉంటారు. ఎవరైన వారికోసం వచ్చినప్పుడు ఆయనభార్య లేచి లోపలికి వెళ్ళిపోతుంది. ఆ వచ్చినాయనను ఆ రెండో కుర్చీమీద కూర్చుండబెడతాడు. ఆయన తన కుర్చీ దగ్గరగా ఒక స్టూలు పెట్టుకొని దానిమీద ఆయన ఉత్తరాలు, వ్యవసాయం తాలూకు లెక్కలు వ్రాస్తాడు. ఆ కుర్చీమీద కూర్చుండి రెండుఘంటలసేపు పేపరు చదువుతాడు. ఆయనకు ఆయాసం వచ్చినప్పుడు స్టూలుమీద కాళ్లు పెట్టుకొని కుర్చీమీద జారపడి నిద్రపోతాడు. నేనోరోజున ఆయన యింటికి వెళ్ళి "ఏమండీ రెడ్డిగారూ! కుర్చీమీద పడుకున్నారే, మంచంమీద పడుకోకూడదా? అని అడిగాను. అప్పుడాయన "ఈ కుర్చీ రెండువిధాల (అంటే కూర్చోడానికి పడుకోడానికి) పనికి వస్తుందండీ" అని సమాధానమిచ్చాడు.

★

ఒకాయన ఈ మధ్య ఒకపత్రికలో వ్రాస్తూ "మళయాళమ్" అనే పదాన్ని యింగ్లీషులో వ్రాసినప్పుడు రెండువైపులనుండికూడ ఉచ్చరింపవచ్చు అన్నారు. రెండుకవారు అన్నారుగదా మళయాళభాష చాలా చక్కనైన భాష. దీన్ని రెండువిధాల (అంటే ముక్కుతోను, నోటితోను) పల్కవచ్చు అన్నారు.

★

ఈ విధంగా రెండువిధాల ఉపయోగపడేవి మన దైనికజీవితంలో చాలా అరుదేమో అని నా అభిప్రాయం. ఎందుకంటే ఒక్క విధాన్నికూడ ఉపయోగపడని వస్తువులు చాలా ఉన్నాయి. రెండువిధాల ఉపయోగపడేవాటికి మనమెంతో కృతజ్ఞులమై ఉండాలి. ఎందుకంటే వాటి ఉపయోగం మనకు రెండువిధాలు.

---

పిల్లలకోసం :

## ఇది కాని ఇది

మతికాని మతి శ్రీమతి; బహుమతి
ఏడుకాని ఏడు నేరేడు
కీలుకాని కీలు వకీలు
కలుకాని కల్లు గుంతకల్లు
కోటకాని కోట సాపర్లకోట
కాలుకాని కాలు పాకాలు
దేవుడుకాని దేవుడు సహదేవుడు
రకముకాని రకము వరకము (పల్లము)
చింతకాని చింత చీమచింత
రాగికాని రాగి బైరాగి

—అద్దంకి రామారావు